# ఎన్నికల గెలుపులో కార్యకర్తల పాత్ర కీలకం

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- చిట్యాలలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం



చిట్యాల: సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు

చిట్యాల, అక్టోబర్ 13 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని రాజ్యసభ సభ్యుడు, నకిరేకల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు.చిట్యాలలో శుక్రవారం బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడో సారి గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రోజుకు కనీసం నాలుగైదు గంటలు కష్టపడాలని కోరారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో అభివృద్ధి కోసం పనిచేసే చిరుమర్తిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాడని అన్నారు. నిత్యం తన్నులాడుకునే కాంగ్రెస్ పరిస్థితి టిక్కెట్లు కూడ ప్రకటించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. వీరేశంపై ఎన్నో ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు వీరేశం గురించి గొప్పలు చెబుతూ ఆయనను గెలిపించాలని కోరడం సిగ్గుచేటని అన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ కార్యకర్తలు సమష్టిగా కలిసి ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా తన గెలుపు కోసం సహకరించాలని కోరారు. తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం రోజుకు 16 నుంచి 18 గంటలు కష్టపడుతున్నానని వివరించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని వివరించడంతోపాటు కాంగ్రెస్ వల్ల జరిగిన, జరుగబోయే నష్టాలను ఆ పార్టీ అభ్యర్థిగా ప్రచారం జరుగుతున్న వ్యక్తి ఆరాచకాలను వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేయాలని దిశ నిర్దేశం చేశారు. అవతలి వ్యక్తికి బయపడాల్సిన అవసరం లేదని తాను ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న చిరుమర్తి లింగయ్య గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేద్దామని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, బెల్లి సత్తయ్య, పందిరి గీత, కో ఆప్షన్ సభ్యుడు పాటి మాధవరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండె సైదులు, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, గుండెబోయిన సైదులు, సిలువేరు శేఖర్, జిట్ట బొందయ్య, విఠల్‌రెడ్డి, దాసరి నర్సింహ, పోలేపల్లి సత్యనారాయణ, కొల్లోజు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కాంగ్రెస్ చేసిన నష్టం చాలు

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

చిట్యాల : బీఆర్ఎస్‌కు బలమైన కేంద్రమైన నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం చిట్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గం ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వంటి ఎందరో బలమైన నేతల నిలయమని అన్నారు. ప్రస్తుత ఎన్నికలు అభివృద్ధి ఆకాక్షించే బీఆర్ఎస్, అభివృద్ధి నిరోధక కాంగ్రెస్ మధ్య జరిగే పోటీ అని ప్రజలు దానిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే చిరుమర్తిని గెలిపించాలని కోరారు. రాష్ట్రానికి కాంగ్రెస్ గతంలో చేసిన నష్టం చాలునని మళ్లీ నష్ట పోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

శాలిగౌరారం, అక్టోబర్ 13 : తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథ కాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని చెప్పినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో గన్నపురెడ్డి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పుట్ట మహేశ్, ఒగోటి శ్రీనివాస్, ముక్కాముల గణేశ్, సిర్పంగి బాలకృష్ణ ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

- నకిరేకల్ రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్



రామన్నపేట : ఇంద్రపాలనగరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్

రామన్నపేట, అక్టోబర్ 13 : ప్రతి ఒక్కరూ ఓటును విని యోగించుకోవాలని నల్లగొండ అదనపు కలెక్టర్ నకిరేకల్ రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇంద్రపాలనగరంలోని పోలింగ్ కేంద్రాలను, నియోజకవర్గ సరిహద్దులను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఇతరాత్ర సదుపాయాలను ఆయన పరిశీలించారు.అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ జలేంధర్‌రెడ్డి ఉన్నారు.



చిట్యాల : ఆరెగూడెం బూత్ కమిటీ

## బీఆర్ఎస్ చిట్యాల మండల బూత్ కమిటీల ఏర్పాటు

చిట్యాల, అక్టోబర్ 13 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పిట్టంపల్లి, ఆరెగూడెం, పెద్దకాపర్తి, వెలిమినేడు బూత్ కమిటీ బాధ్యులను నియమించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నకిరేకల్ ఎమ్మెల్యేగా చిరుమర్తి లింగయ్య గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో బూత్ కమిటీల బాధ్యులు సమిష్టిగా అందరిని కలుపుకొని పనిచేయాలని సూచించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు అయిలయ్య, కల్లూరి మల్లారెడ్డి, వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ రుద్రారపు బిక్షపతి, నాయకులు యాదగిరి, కొలను వెంకటేశ్, రాచకొండ కిష్టయ్య, మర్ల రాంరెడ్డి, మర్రి జలంధర్‌రెడ్డి, ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, బాతరాజు రవీందర్ పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నకిరేకల్: : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని బాబన్‌సాహెబ్ గూడేనికి చెందిన సింగం లింగయ్య యాదవ్, 10వ వార్డుకు చెందిన కందాల లక్ష్మమ్మ శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. వారి మృతదేహాలకు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి కిచెందిన వడ్డెగోని నర్సింహ గౌడ్ ఇటీవల గుండె చికిత్స చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుం టున్నాడు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం ఆయనను పరామర్శించారు. అనంతరం మండలంలోని నైబాయి గ్రామ ఉపసర్పంచ్ సోమ బుచ్చిరెడ్డి తల్లి అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నది. వారిని పరామర్శించారు. అలాగే అదే గ్రామానికే చెందిన జక్కలి యాదయ్య అనారోగ్యంతో మరణించగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## చెర్వుఅన్నారం మాజీ సర్పంచ్ లింగయ్యకు నివాళి

కట్టంగూర్, అక్టోబర్ 13 : మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కామ్రేడ్ మందుల లింగయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నకిరేకల్ హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్, మాద శివ శంకర్, శాంతికుమార్, గద్దపాటి సుధాకర్, మర్రి మధు, పొన్న శ్రీను పాల్గొన్నారు.

## భారీగా నగదు, మద్యం పట్టివేత

నల్లగొండ సిటీ, అక్టోబర్ 13: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరైనా ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బును శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. కనగల్ ఎస్ఐ అంతిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం తనిఖీలు చేస్తుండగా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.98,320 పట్టుకున్నారు. నల్లగొండకు చెందిన మహమ్మద్ ఖలీమ్‌ఉద్దీన్ వద్ద నుంచి సీజ్ చేసి డీటీఓకు అప్పగించినట్లు చెప్పారు.

- కనగల్ మండలంలోని దర్వేశిపురం, చర్లగౌరారం గ్రామాల్లో బెల్ట్ దుకాణాల్లో పోలీసులు మద్యం పట్టుకున్నారు. దర్వేశిపురం గ్రామానికి చెందిన మాద నర్సింహ వద్ద 30 బీర్లు, గౌరారం గ్రామానికి చెందిన కారింగు సత్తయ్య నుంచి 36 బీర్లు అదే గ్రామానికి చెందిన చెనగోని శ్రీను నుంచి 24 బీర్లు 8 మద్యం ఫుల్ బాటిళ్లు 19 ఆఫ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

- శాలిగౌరారం : వంగమర్తి గ్రామ శివారులోని నేషనల్ హైవేపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అర్వపల్లి నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న దేవులపల్లి రామచంద్రరావు కారులో రూ.86వేల నగదును పట్టుబడినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. నగదును అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

- కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన కన్నెకంటి వెంకట నారాయణ, మారుకొండ శ్రీనివాసరావు కొండమల్లేపల్లిలో బ్యాంకు నుంచి 1.50 కోట్లు విత్ డ్రా చేసుకొని చింతపల్లి మండలంలోని నసర్లపల్లి గ్రామంలోని వెంకటేశ్వర కాటన్ మిల్లు బైక్‌పై వెళ్తుండగా సీజ్ చేశారు. అలాగే గ్రామానికి చెందిన పెర్ల హైమావతి బ్యాంకు నుంచి గోల్డ్ లోన్ తీసుకుని బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆమె వద్ద ఉన్న రూ. 94.500, హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లికి వస్తున్న వికాస్ గంగోపాధ్యాయ నుంచి రూ. 84,500 సీజ్ చేసినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన నగదును రెవెన్యూ అధికారులు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ నగదు పట్టివేతలో ఆర్‌డీఓ శ్రీరాములు, తాసీల్దార్ దివ్యారెడ్డి, ఎస్ఐ వీరబాబు పాల్గొన్నారు.

- దేవరకొండ : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సిద్దాపురం మండలానికి చెందిన డ్రైవర్ జక్కుల దాంజనేయులు డీసీఎంలో తరలిస్తున్న రూ. 5 లక్షలు పట్టుకున్నట్లు సీఐ నాగభూషణం తెలిపారు. డబ్బులు, డీసీఎం సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

- నాగారం : నాగారం ఎక్స్‌రోడ్డు సమీపంలో ఎస్ఐ సైదులుగౌడ్ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డి.కొత్తపల్లి ఆవాసం భీమ్లాతండాకు చెందిన ఇద్దరు మహిళల హ్యాండ్ బ్యాగ్‌లను చెక్ చేయగా రూ.9.90 లక్షలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

- అడ్డగూడూరు : మండలంలోని చౌళ్లరామారం, తిరుమలగిరి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకుండా బైకాని కుమార్‌స్వామి రూ.లక్ష తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

- నేరేడుగొమ్ము(చందంపేట) : మండలంలోని పలు దుకాణాల్లో ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 75 మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కోదాడ రూరల్ : హుజూర్‌నగర్ మండలం మాధవరాయనిగూడెం గ్రామానికి చెందిన వస్త్ర వ్యాపారి కందుల వినయ్ కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు కారులో రూ.10లక్షలు తరలిస్తుండగా ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలో పట్టుబడినట్లు సీఐ రాము తెలిపారు.

## నేటి నుంచి శాలిగౌరారంలో బీఆర్ఎస్ పల్లెబాట

శాలిగౌరారం, అక్టోబర్ 13 : తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ.. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం నుంచి మూడ్రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించేందుకు బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకత్వం గ్రామాల బాట పట్టనుంది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సం క్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజలను చైతన్య వంతం చేసేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. సంబంధిత షెడ్యూల్‌ను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. 14న శని వారం జాలోనిగూడెం, తక్కెళ్లపహాడ్, బైరవునిబండ, ఎన్‌జీ కొత్తపల్లి, మనిమద్దె, ఉప్పలంచ, రామంజాపురం, గురజాల, 15న శాలిలింగోటం, అంబారిపేట, తుడిమిడి, చిత్తలూర్, వంగ మర్తి, ఇటుకులపహాడ్, మాదారం కలాన్, పెర్కకొండారం, 16న తిరుమలరా యినిగూడెం, రామగిరి, బండమీ దిగూడెం, ఊ ట్కూర్, శాలిగౌరారం, అడ్లూర్, వల్లాల, ఆకారం గ్రామాల్లో పర్యటించనున్నట్లు వెంకన్నగౌడ్ పేర్కొ న్నారు. ఆయా గ్రామాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

నల్లగొండ సిటీ, అక్టోబర్ 13 : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కనగల్ ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా లింగోటం గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.